


వరి కోతలు కాంగనే, పైకం సేత్లకి రాంగనె ఎంకిగాడి మనసుకి పట్నం సూడాలన్న ఖాయిషైంది పోలవ్వ కాడో పది, మల్లి మామ కాడో పదేను గిట్ల ఇరవై ఐదురుపాలు జమ సేసిండు

''బద్రంగ సూసిరారో! ఆడ రామిగాడ్ని కలుపుకోరో'' అని మామ, వూరి జనం అందరూ పొలిమేర దాకా సాగనంపింద్రు. ఆ వూర్లకెల్లి పట్నం సూసిరానీకి పొంవోర్లోకి మొదటోడే మన ఎంకిగాడు వూర్లో ఆడంటె అందరికి జరంత 'ఇజ్జత్, పెరిగింది ఆడు కండవ నెత్తికి సుట్టి, సుట్ట నోట్ల బెట్టి ధోతి అంచు బొడ్ల దోపి, రైలు ఎక్కి, పొలంలున్న నాగి సాయిగ సేతులూపితె, అది తన మావ ఎంత గొప్పోడో తెలుసుకొని మురిసింది

ఆడు సద్దిమూట, రెండు గిన్నెలు,పొయ్యి కట్టెల కట్టా పైన రైలు అటక మీద పెట్టి కింద రైలు భూమి మీద 'సక్కలం బుక్కలం' ఏస్కకూకొని దర్జాగా, ఇగ నోట్ల సుట్ట బెట్టి రైలింజని కంటె జోరుగా పొగ ఇడుస్తొంటె ఆడి మనసుల ఎన్ని కొత్త బూతులు గేపకం అచ్చిన్నాయ్?! యెవ్వరికి సెప్పలేనన్ని!!

రైలు ఘడిఘడికి ఆగుతా పోతున్నది. జర్ర టేమ్ బితాయించి నాంక ఎంకిగాడి కాడికో తెల్లబట్టల దొర అచ్చిండు.

''ఏంది కావాలె?'' గన్నట్టు సూసిండు ఎంకిగాడు.

''టికెట్'' అన్నడా దొర.

''అమ్మ నాయాలా! తిక్కటంట తిక్కటి! నీ యబ్బసొమ్మా ఏమయనీకి. ఆరు రూపాలిచ్చి కొన్న.'' అన్నడు జరంత కోపమై.

గంతల ఎనక్కెలి ఒక నీలం సొక్కా, నెక్కరేసుకొనోడొచ్చి, తిక్కటాయిన గురించి ఎరక పర్చిండు.

''అర్నె! ఈరిదేనా రైలు!'' అని ముక్కు నేలేసుకున్నడు మనోడు.

''మరి కిందెందుకూకున్నవ్? పైన కూకోరాదు.'' అన్నడా పోట్టరాయిన. పోట్టరంటె రైలు జీతగాడని పక్కనుండ పెద్దమడిసి సెప్పిండు.

ఇగ అటుజేసి గిటుజేసి పట్నంల రైలాగింది. ఎంకిగాడు మూటాముల్లె యెత్తుకొని స్టేసని బైటికి నడవ బట్టిండు ఈ కొనకెల్లి ఆ కొన కెల్లినా 'రాస్తా ఎటో, 'దరవాజా' ఎటో ఎంకిగాడికి అంతే బట్టలేదు. ఆడికెల్లి నడుస్త జరంత దూరం పొంగనె కొంతమంది బైటికి తోస్కబోతా కంట బడింద్రు. ఎంకిగాడు ఆళ్ల ఎనకాలే బైటికి పోబోయిండు. దార్ల ఇంకొక తెల్లబట్టల దొర ''టికెట్'' అని సెయి జాపిండు ఆర్నె! ఈరు ఆ తెల్ల బట్టల దొర తమ్ముడేమొ!' అనుకొన్నడు ఎంకిగాడు

''ఈరంతా నా తిక్కటెంబడి తగిలింద్రు''నుకొని మూట పక్కనదింపి తిక్కటు బొడ్లకెల్లి తీసి ఇచ్చిండు

ఆ దొర తిక్కటి సేత ముంచుకొని ఇగ పొమ్మన్నడు

''గిదేందయ్యా!? ఇంతమంది తిక్కట్లు ఇత్తున్నా సాలలేదా?! నాది నా కిచ్చెయ్!'' అని ఆడనే కూకున్నడు ఎంకిగాడు ఆ దొర

కావాలె మనోడి మెడలు బట్టి బైటికి నూకిండు

"ఆర్నీ అక్కపాగరు!??" అనుకొంట కోపంగ ఎంకిగాడు బైటికొచ్చిండు

"యాడ్కి పోవాలె????!!" అని జరంత మంచి ఎంకిగాడి మాటలు గుంజ షురూ జేసిండ్రు

'యెంద్రో ఎందుకట్ల గుంజుతరు?" గొంతుసించుక అర్సిండు అసలే తెల్ల బట్టలాయన తిక్కటి గుంజుకున్నడన్న కోపాన

"ఏంటికి కోపం సేస్తవయ్యా? మాకు రిచ్చబండ్లున్నయ్ యాడ్కి నిన్ను దీస్కపోవాలె?" అన్నడంత్ల ఒక రిచ్చోడు

"గట్లనా? ఐతె రాత్రుండనీకి మంచి సత్రానికి దీస్కపో" అన్నడు ఎంకిగాడు

"ఐతె ఆరాన ఇయ్యి" అన్నడొక రిచ్చోడు ఎంకిగాడ్కి కోపం అచ్చింది

"గిదేందంట! ఈడు పైకం అడుగతడు, గదే వూర్ల బండెక్కితె, చిల్లి గవ్వడుగరు!, పైకం లేదు గీకం లేదు, కాదంటె ఒక సుట్ట ఇత్త, ఘుమ ఘుమ తాగు" అన్నడు ఎంకిగాడు పక్క జేబ్లకి చెయ్యి పోనిచ్చి

"పోరా! సుట్ట ఇత్తడంట, సవారి కట్టాలంట" అనో ముసలి రిచ్చ తాత ఎళ్లిపోయిండు

"ఈడ పైకం కట్టందే రారేమొ!" అనుకొని సుట్టదుమ్ము గుంజి, ఓరిచ్చోడ్ని పిల్చి కిరాయి గిట్ట మాట్లాడుకొని రిచ్చెక్కిండు

రిచ్చ ముందుకు నడిసింది

'పట్నంల రంగురంగుల దీపాలు సొగ్గ పెట్టిండ్రు అబ్బ ఎందరు మడుసులు మందలు మందలు! అందరు సొక్కలు, లాగులేసుకున్నరు ఒక్కడు గూడా కండవ ధోతి లేస్కలేదాయె!' అన్ని భవంతులె! రాస్తపంటి ఒక్కగుడిసె కూడా లేదాయె మన సొప్పదంట్ల పొలెంలనైతె అన్ని గుడిసెలే!!" రిచ్చోడు రిచ్చబండిని ఒక పెద్ద భవంతి ముందాపిండు

"గిదే సత్రం" అన్నడాడు

"ఆర్నీ లక్కొ! గింతంత దూరం గాడ తీస్కపోతె, ఎక్కువ పైకం గుంజిండు ఈడ జరంత 'హోషియార్' గుండాలె అనుకొన్నడు

అబ్బ లోపలెన్ని బండ్లున్నయ్! అన్నీ మరబండ్లే! "డుర్" మని ముందుకురుకుతై దాని గొంతు యెట్ల నొప్పి పుట్టదో?? మడిసి అడ్డం వస్తె పొలు "కై" మంటది దానికి మడిసి కంటె ఎక్కువ తెలివె వుండది ఎంకిగాడికి, పట్నంల వింతలు మాబాగా నచ్చినయ్ దార్ల పోతున్న ఒక మడిసిని బిలిచిండు ఆ మడిసి సొక్కని నెక్కర్ల దోపిండు కండ్లకేమొ సులోచనాలున్నై మెడల బట్ట కట్టిండు ఆయనేదో బాసలని నవ్విండు

సత్రం సొయిగ సూపుతు "దాని పేరెందంట" అడిగిండు ఆడు జరంత మనోడి మొహం సూసి ఘాటుగ

"తాజమహల్ బోర్డింగ్ ఎండ్ లాడ్జింగ్' అని పోయిండు

ఇగ ఎంకిగాడి కేమి అంతుబట్టలేదు

"తాజామల్లు బోడిగాడి" ఆర్నీ అక్క! ఏం పేరు, ఏం పేరు! మా సొప్పదంట్ల పొలెంల గూడా లేదుగదా?!" అనుకొంట ఎంకిగాడు లోపలికి పొబొయిండు

"ఏయ్! బాహర్ చెలో" అనో తలపాగ వున్నాయిన మనోని అకారం సూసి బైటికెల్ల నూకిండు

"అరేయ్ సత్రంలకి పోతె వద్దంటవేంద్రా గాడిదకొడుక!" ఉడుకుతా అర్సిండు ఎంకిగాడు అసలే ఆకలి మీదున్నడేమొ! ఆ సత్రమొడు గివ్వేమి ఇన్పించుకోకుండా మనోడ్ని బైటికి నూకిండు

"ఇగ ఫాయిద లేదు ఏడ్కన్నపోవాలె" అనుకొని ఇగ నడువ షురు జేసిండు గట్ల పొంగపొంగ ఒక ఇంటి ముంగట పెద్ద అరుగులు కన్పించినై

అమ్మయ్య అని, పొనం నొస్తుంటె కూకున్నడు ఇగ గిన్నెలు గట్ల దీసి పక్కనే రెండు బండలు పెట్టి జకముక రాయితో నిప్పుజేసి మెతుకులుడి కేసుకొని బువ్వదిని అరుగులు సాఫ్ సేసుకొని ఆ రెయ్యి ఆడ నిద్దర బొయిండు

తెల్లారి గట్ల లేవంగనే ఒక ముసలవ్వ 'రాస్త' వూడుస్తు కనబడ్డది మనోడికి, నవ్వొచ్చింది "గిదేందబ్బా! ఈ అవ్వకు పని లేదా వూకే వూకుడ్ది జర, ఇల్లాడ్చి కలాబు సల్లుకొనికే పొద్దెక్కుద్ది ఈమెకు గిట్ల పిచ్చెక్కలేదు గదా!" అని ఎంకిగాడు నోట్ల కండవ కుక్కుకొని నవ్వాపుకో బట్టిండు

"గదేంది! ఆడ బువ్వొండినవ్, ఆడంత నల్లంగ మాడింది ఆ బుడిదె ఆడ్నే వుంచి నవ్? సిగ్గులేదు? రోజూ నీలాంటోరు పొస్తె మేమూడ్వలేక సావాలె" అని గయ్యిమని లేచిందా అవ్వ ఎంకిగాడికి మా పెద్ద సిరాకేసింది

"నే పొస్తె నీ కెందుకు? పని లేకుండ వూరి బాటలన్నీ వూడుస్తొండవ్, నన్ను తిడ్తె వూరుకోనవ్వో!" అన్నాడు మన సొప్పదంట్ల పొలెమొడు

అవ్వ ఎంకిగాడ్ని సూసి నవ్వింది "పల్లె పల్లెమొమూ పొయిరా!" అంది ముక్కునే లేసుకుంటూ

ఎంకిగాడు కోపంగ మూటముల్లె పర్సుకొని బుజానేసుకొని నడవబట్టిండు!

కొద్దిదూరంల ఒక 'యాప' సెట్టు కంటబడ్తె మూటలు సెట్టు కిందబెట్టి సెట్టెక్కి పుల్ల ఇర్సుకొని నోట్లేసుకొని నడవ షురు జేసిండు జర్ర దూరం బోంగనె అడో నల్ల (రైల్లో కూసుండి దాన్ని లోపలికి నూకితేకింద గొట్టంల కెల్లి నీల్లొస్తయ్!!) వుంటె అడ మొహం గిట్ల కడుక్కొని సెట్టు కింద బువ్వ వండుకొని తిని ఇగ పట్నం సూడనీ కెల్లిండు

పట్నం ఒక పద్దతిల 'సూడాలని' అనుకొన్నడు మనోడు ఒక దార్నపోయే రిచ్చోన్ని పిలిచి, "పట్నంల సూసేని ఏమున్నై" అని అడిగిండు ఆడు నీల్లు తాగినట్లు గడగడ సెప్ప షురుజేసిండు

"మెల్లంగ సెప్పరాదు" అన్నడు ఎంకిగాడు జర ఆ బాసెందో సమజుగాక

"చార్‌మినార్" అని ఎల్లిపోయిండు రిచ్చోడు

"సారుమున్నరూ! గిదేం పేరబ్బా! భలే గుండే మట్టగిడస లాగా!"

ఎంకిగాడు రాస్త ఎంటి అడుక్కొంట సార్‌మన్నరు, కెల్లిండు అబ్బ ఎంత ఎత్తుగున్నది! ఆకసంలకి సొచ్చుకొని, పోయింది ఎవడో రాచ్చసుడే దీన్ని కట్టుంటాడాలె గుడిసెక మట్టి గోడలు కడితే నిలబడవు ఇంత పెద్దదెట్ల కట్టిండ్రబ్బా?!' మనోడు నెత్తి పైకి సూస్త ముందుకు నడవబట్టిండు కిందున్న అరటిపండు తొక్క సూడక దానిమీద కాలుపెట్టి సర్రున జారి ఎనకనే పుస్తకాలు పట్టుకొని నడుస్తున్నామె మీన తూలి పడ్డడు.

ఆనో బాసల తిట్టి సెప్పుతో కొట్టి రుసరుసా లాడ్తాపోయింది ఎంకిగాడు తం గ్గైరాగు తనః నాగి మీన బడ్తే గిట్లనే కొట్టుద్దా? ఛీ! ఏం పట్నం మడుసులు!'' అనుకొన్నడు మనసుల.

''ఎంద్రో ఎంకిగో'' యాడికెల్తో ఎవరో అరిచిండ్రు. ఎనక్కు తిరిగి సూసిండు ఎంకిగాడు.

''అరె రామిగా!!??''

ఎంకిగాడి పానం లేచింది. ఆడికాడి కుతికె మూటాముల్లె కింద బెట్టి ఆడ్ని గట్టిగా వాటేసుకొన్నడు.

''పట్నం సూడ్నీకి వచ్చినవ్ రామీ,, వుండనీకి సత్రాలు గిట్ల లేవు కదా? నువ్వు కనబడకుంటె సీతమ్మొరంత కట్టాలు పడ్డననుకో.'' అన్నడెంకిగాడు లాల్ సూరత్ జేసుకొని.

మా ఇంటికి పోదాం పద ఆడనే వుండి పట్నం సూసుకొని పాలెం పోదుగాని''అన్నడు రామిగాడు.

''పదె మరిగ ఇంటికి పోదాం పద'' అన్నడు ఎంకిగాడు.

రామిగాడు ఎంకిగాడ్ని తన రిచ్చల కూకుండ బెట్టుకొని శాలిబండల ఉండ తన గుడిసె దిక్కు తోల్కపోయిండు.

గుడిసె కెల్లె దార్ల పట్నంల సూడ దగ్గవన్నీ సెపిండు రామిగాడు. గుడిసె కెల్లి అత్త పెట్టిన బువ్వ దిని సూర్యుడు నెత్తి కొచ్చిందాక నిద్దుర బోయిండు సొప్పు దంట్ల పాలెమోడు.

ఇగ మద్యానం రెండు గంటలకట్ల 'సాయ్' తాగి పట్నం సూడనీ కెల్లిండ్రిద్దరు.

''పట్నం సూడ్నీకి బాగ పైకం ఉం డాలె!'' అన్నడు రామిగాడు.

''గభేరాయించకు తమ్మో, నాకాడు న్నయ్‌లే!'' అన్నడు ఎంకిగాడు మీసం దువ్వు కొంట.

''ఓటల్ కెల్దామె?'' అన్నడాడు.

'గదేంద్రో'' అడిగిండు ఎంకిగాడు.

'ఆడ పైకం దీస్కొని తిననీకీ తాగనీకీ ఇస్తరు.''

''గదా మనవాళ్ల సెన్నిగాడు పెట్టిండు.''

ఇద్దరు జరముంచి ఒటల్‌లకే బోయిండ్రు.

''అబ్బో గిదెందోగానీ ఒచ్చినోరందరికీ కుర్సి పీటలేసిండ్రు. సెన్నిగాడ్దైతే సాపలు పరుస్తే సతిపొద్దిగా!'' అని నోరెల్ల బెట్టిండు ఎంకిగాడు.

# ఎంకిగాడు పట్నం...

ఇద్దరు 'సాయ్' తెప్పించుకొని తాగిండ్రు.

పైకం కట్టేటాలకి ఎంకిగాడు గుడ్లు పచ్చబడినాయ్.

''ఆతాన గుంజిండు, ఈడమ్మ కడుపు కాల'' మనసులనే తిట్టుకొన్నడు ఎంకి గాడు.

ఇద్దరు బైటపడిండ్రు.

''బస్సుల తిరుగుదాం?'' అడిగిండు రామిగాడు.

''ఆరెండు భవంతుల బస్సు ఎక్కుదాం!'' అన్నడు పూరోడు.

ఇద్దరూ రెండు భవంతుల బస్సు సిడీ లెక్కి పైకి బోయిండ్రు. ఎంకిగాడు బస్సు కుర్సీల కూకొని ముందుకూ ఎనక్కూ సూసిండు. నడిపెటోడు ఎక్కడ కండ్ల బడలేదు.

''గిదేందబ్బా యెవ్వరూ నడపందే ఎట్ల నడుస్తది?'' అనుకొన్నడు ఎంకి. మెల్లగ లేసి ముందుకు బొయ్యి కిటికీల కెల్లి బైటికి సూసిండు. ఎడ్లని గినక కట్టిండ్రే మోనని. ఆడకూడా ఏదీ లేదు. ఎంకి గాడు మెల్లిగా రామిగాడి పక్కన కూకొని నడిపెటోడు లేడని సెప్పిండు.

ఆడు నవ్వి ''కిందున్నడులే అడే నడిపు తడు'' అన్నడు.

''గిదేందబ్బా? పైనేమొ నడిపెటోడు లేడు, ఆడేమొ కిందికెల్లి నడుపుతడంట. గదెట్ల కుదురుద్ది.. గిదేం బాలనాగమ్మ నాటకమా ఏమన్నవా!'' అనుకొన్న డెంకి గాడు.

ఇంతల అది ''డుర్''న మోగ సురు జేసింది.

గిదేంది, సలి జరం వచ్చినోడిలాగ,, గటుగ్గాగుద్ది'' అనుకొన్నడు మన సొప్పు దంట్ల పాలెమోడు.

'గది గంతెలె.'' అన్నడు రామిగాడు.

బస్సు కదిలింది. ఎంకిగాడు యదల్ అగ్గి పుట్టినది, కాని 'సాంస్' బిగాయించి పట్టుకూకున్నడు. బస్సు కదిలి జర్ర ముందుకుపోయినాంక జర్రన పానం సొచ్చింది.

''బాగయాప్'' మని రెండు తిక్కట్లు కొన్నడు రామి. దార్ల ఒకింటి ముందు పెద్ద బొమ్మలు పెట్టిండ్రు. ''గదేందంట'' అడిగిండు ఎంకిగాడు.

''అవి సైనెమ బొమ్మలు'' అన్నడు రామి

''గదేంద్రా ఎంకీ !''

అందుల గుడ్డపై బొమ్మలు ఆడుతై. గది గూడ సూద్దంలె'' అన్నడాడు

ఇగ బాగయాప్ రాంగనె ఇద్దరు బస్సు దిగిండ్రు. ''అయితె ఎంకి, గీ బాగ యాప్ ఎంద్రా, జర్రగూడ సమజైత లేదు.''

''బాగయామంటె పట్నం మద్యలున్న తోట. గీడ పచ్చని గడ్డి కూకోనీకుంటది గులాబి పూల తోట బడే మజా గొస్తది ముందైతె అంటె నిజాం కాలంల గీడ జంతువులుండేవి, కాని ఈడినుండి అవి ''జూ''కి మార్సిండ్రు. ఈడ సాయింత్రం పైతె పేయనీకు బాగుంటది గీడ పడవ సైర్' కూడుంది.'' అనుడు రామి అన్ని సూపిస్త.

బాగయామ్ల ఒక సోట ఒకాయన, గడ్డి మీన కూకున్నడు, ఆయన సేత్ల అడస యంత పెట్కున్నది. అది కయ్, కయ్'న పాడుతున్నది. ''ఎంద్రా ఆ పదాలు సౌజేది'' అడిగిండు ఎంకి.

''గదంతెలె'' అన్నాడు రామి.

''అంటె'' అన్నడు ఎంకి.

''గది లేడియు, పదాలు పాడుద్ది!''

జర్ర దూరం నడిసినాక అడిగిండు ఎంకి, ''బాగయాప్‌కి ఇంకో పేరు గిట్ల లేదా ''

''ఎందుకు లేదు, గదెదో బాసలంటరు పబ్లిగార్డన్స్''

ఆఁ!'' ఎంకిగాడు ముక్కునేలేసుకొని నోరు తెర్సిండు.

ఇద్దరు నడువ సురుజేసిండ్రు.

''ఎంకన్నా కొండెక్కుదాం!'' అన్నడు రామిగాడు దూరంగున్న గుట్టల పొంటిగ సూపుతు.

మైసమ్మ కొండలా '' అన్నడెంకి గాడు కొండ మీద గోపురం సూసి

''ఏహా ఆడ తోటున్నది, దాన్ని నవబత్ పహాడంటరు.''

''యేంద్రో రామిగో ఆ సొప్పదంట్ల పాలెమొడ్ని మొసం సేస్తవ్! కొండ మీద తోట పెరుగుద్దంట.'' ఎంకిగాడు నవ్వ షురుజేసిండు.

''దారాడు నువ్వే సూసి గట్టి సేసుకో ''

అన్నడు రామి.

ఇద్దరు కష్టం మీన కొండెక్కిండ్రు

# ఎంకిగాడు పట్నం...

" ఆడ కొచ్చిన జనాన్ని సూసి ఎంకిగాడు ముక్కు నేలేసుకొన్నడు. ఆడ పెద్ద తోట పువ్వుల సెట్లు అబ్బ! అబ్బ, ఏం కమ్మ గుందాడ' "

యెవరో ఒకాయన పెట్టె పట్టుకొని ఏదో వత్తా ఉన్నడు. ముందు కొందరు నిలబడింద్రు కదలకుండ. ఆడికొచ్చిన ఆడోరు తెల్లగ పాలరంగుతో వున్నరు.

"ఆ డబ్బ ఎంద్రా రామీ " ఆడిగిండు మనోడు.

"గది సొటువోలు తీసేది."

"పొటువంటె నన్ను సిన్నప్పుడు మా అయ్య సింతబసేన్ల దింపించేదు గదేనా" అడిగిండు.

రామిగాడు ఔనన్నడు.

"ఎంకిగా గటు సూసినావ్! గది హుసెన్ సాగర్ సెరువు."

"భలే గంద్రా." అన్నడాడు.

జర్ర దూరంల అనేకం మోరబండ్లు న్నయ్! గోపురం మద్యల తెల్లని డబ్బా వున్నది.

"ఎంద్రా అది రామీ-"

"సుక్కలు సూసేదన్నా."

"సుక్కలందల్ల కనబడ్తయా" అడిగిండు. "ఔ" అన్నడు రామి.

ఇంతల సీకటి పడ్తున్నదని డబ్బ తెరిసింద్రు.

అందరు ఆడ గుమ్మిగూడి సైకం కట్టి సుక్కలు సూడబట్టింద్రు. ఎంకిగాడు సైకం గట్టి బొక్కల కెల్లి సూసిండు.

"సుక్క ఇంక సిన్నగ కనబడబట్టింది."

మనోడికి కోపమొచ్చింది. రామిగాడి సెయ్యి పట్టి ఆడికెల్లి ముందరికి గుంజుకొని పోయిండు. ఇగ ఆడికెల్లి కొండదిగి హుసెన్ సాగర్ దిక్కు నడవబట్టింద్రు.

గది సూసినావ్ ?" దూరంగ ఇనుము తంబానికి కొన్ని గొట్టాలు సూపిండు రామి.

"ఎందది?" అన్నడు గటుసూస్త ఎంకి.

"గది నాలుగు బాటలు కలిసే సోట పెట్టిరు. అందుమూడు రంగుల దీపా లుంటై. ఎర్రది ఎలుగుతె ఆగాలి. పచ్చది ఎలుగుతె పోవాలె. పసుప్పు దెలుగుతె సిద్దం గుండాలె. రోడ్ల మీద మొటర్లు (మోర బండ్లు) ఒకదాని కొకటి గుద్దుకోకుండ ఆ దీపాలు జవాబుస్తయ్" మనోడు వోరెల్ల బెట్టిండు.

గది సూస్కొని ఇగ హుసెన్‌సాగరు కట్ట మీన కొచ్చింద్రు. గట్టు మీన అడాడ కుర్సీ పీటలేసింద్రు. ఆడభీ అనేకం జన మొచ్చింద్రు. ఇగ నడిసి నడిసి ఒక్కాడ ఇద్దరు కూకున్నరు. ఎనక బాట మీన అనేకంగ మోర బండ్లు వురుకులు పెడ్తున్నయ్.

"చికీ చికీ" అంటు అరుస్త ఒక, వొచ్చిండు.

"చిక్కి తింటావా?" అడిగిండు రామి.

"తెమ్మనను." అన్నడు మనోడు.

"మరి చారానా ఇయ్యి."

"దీనికి గూడ సైకం కట్టాల్నా?" గుడ్లు తేలేసిండు మనోడు.

"అవ్!" అన్నడు రామిగాడు ఉషారై.

ఇగ సైకం గట్టి అవి తీసుకొన్నరు. దాని మీది వుల్లిపొర కాగితం సింపంగనే లోపలేదో వుంది.

మసగ సీకట్ల సరిగ్గ కంటబడలేదు.

ఇగ నోట్ల పెట్టి కొరికిండు ఎంకి.

"అరేయ్ గిది బెల్లప్పాకంరో" అన కొండు.

"ఔమరి చిక్కి అంటె గదే" అన్నడాడు. ఖుషిగ తిని లొట్టలేస్త.

"ఏడ్సినవ్ సారానా కుబూల్ కర్సువేసి నవ్, పద ఇంటికి." అన్నడాడు ఏడ్పు మొహం పెట్టి.

ఇగ ఇద్దరు రెండంతస్సుల బస్సు ఎక్కి నవ్వపూల్ కాడదిగి ఇంటి దొవ్వ బట్టింద్రు.

దార్ల జర్ర గుస్స తగ్గించి ఎంకిగాడు రామి నడిగిండు.

"రేపాడ కెళదం?"

"రేపు గోల్కొండా గండిపేట ఎల్దాం" మన్నడు రామి.

ఇద్దరా రెయ్యి ఇంటికి బోయ్యి సూరత్త బెట్టిన్నసద్ది తిని కూకున్నరు.

"ఎంకన్నా!"

"ఎంద్రా."

"సైన్మా సూద్దాంయ్?"

"ఎంద్రా"

"సైన్మాసే, గుడ్డల మీన బొమ్మ లాడుతై! గది!"

"మరి అందుల ఏం సూస్తరు?"

"అందుల లవకుశ సూస్తరు. అది కాకుంటె అంజిగాడున్న సైన్మాసూద్దాంయ్"

"గది సరేగాని అరు రాములోరి పిల్ల గాంద్రు గదు " ఎంకిగాడు నెంపలాయించు కొన్నడు.

"ఔనే" అన్నడు రామిగాడు.

"ఆడభీ సైకం గట్టాల్నా?"

"ఔ మరి."

"ఇగ బైలెల్లు, ఏం సేస్తం!" అన్నడు లేచి కండువ దులుపుకొంట.

సైన్మా సూసెసోటిగాడికి బోయ్యి సుట్టు తాగుకుంట లోపల కుర్సీల పీట మీన కూకున్నరు.

సైన్మ షురుగాబట్టింది.

ఎందో రాత సూపింద్రు, ఆనక నీలంగ రాములోరు కుర్సీ పీట మీన కూకున్నరు. ఆడ ఎందరో ఆడోల్లున్నరు. ఎనక్కాలి పాటలు పాడ్తున్నరు. రాములోరు నవ్వు తున్నరు.

సైన్మల ఆడోరు తైతక్క లాడ్తున్నరు.

గదే సొప్పుదంట్ల పాతెంలనైతె, చిరతల రామాయణంల నాగి పాదాలు కలుపుతె, తాను రామసెంద్రుడు, నాగి సీతమ్మొరి లెక్కుంటరు. వూర్ల తను రాములోరి ఏసం కడ్తె తననందరు సెయ్యెత్తి దండంభీ పెడ్తరు. గదే ఇసయం రామిగాడికి సెప్పిండు ఎంకి.

"గుడ్డలమీద రంగుల్ల ఏం వూర్ల అడువులు పల్లెలు ఎన్ని సూపింద్రు. సాకరి తప్పడు యుమగున్నడురా, నాసామిరంగా!" అనుకొన్నడు. సైన్మ సూస్త అందులనే రామిగాడ్ని నాగనుకొని గడ్డం పట్టి ముద్దు పెట్కుకున్నడు.

రామిగాడి గడ్డం గుచ్చుకొని మీసాలు ముక్కులకి పోంగనే ఈ లోకంలకొచ్చిండు ఎంకిగాడు. సైన్మల అంతా సీకటి సేసింద్రు గనక ఎవ్వరు సూడలేదనుకొన్నడు ఎంకిగాడు.

ఇగ సైన్మ అయిపోంగనె ఇద్దరు ఇంటికొచ్చి ఎచ్చగ నిద్దర బోయింద్రు.

రాత్రి కలల సీతమ్మొరి లాగున్న నాగి కనబడంగనె జర్రంత ఏడుపొచ్చింది ఎంకిగాడికి. "నాగేయ్ ఈడ నేనెంత కట్టాలల పాల్లైనో తెలుసా" అంట బోరు నేడ్సిండు ఎంకి.

* * *

"తెల్లంగ తెల్లారింద్రా లెవ్వరా" అరు స్తున్నది అత్త.

ఇగ లేచి రామిగాడిచ్చిన పుల్ల నోట్లేసు కొని మొహంగిట్ల కడుక్కోని అత్త ఇచ్చిన సాయ్ తాగిండు ఎంకి. ఇగ తానం గిట్ల జేసుకొని సద్ది తిని పట్నం సూడ్నీకి తైతెల్లింద్రుడిద్దరు.

"సైకం తెత్తున్నావే?" అడిగిండు రామి గాడు.

"తెచ్చిన్నాంల కెల్లి సగం అయిపోయింది." అన్నడు.

"మరి పట్నమంటె దరువన ఎకొన్నావ్?"

ఎంకిగాడికి రోషమొచ్చింది. జేబున్న ఇరవై రూపాలు తీసి సూపిండు.

రామిగాడు 'సదిగ' అన్నడుషారుగ.

ఇద్దరు నడుస్త నవ్వపూల్ కాడికొచ్చింద్రు.

ఆడ చిన్న గున్నబస్సు ఎక్కి కూకున్నరు. కొద్ది సేపైనాంక ఇగ బస్సు కదుల్త దనంగనే ఆడోరు మందలకు మంద లొచ్చి కూకున్నరు.

"ఒరమ్మొ సస్తిరో!" అనరిసిండు ఎంకి గాడు.

"ఎంకవ్వో పూర్కోరో!" అదిలించిండు రామిగాడు.

"మరందరు మీదనే కూకుంటున్నరు.

జ్రసేపు సంబాళించుకొంటె గోల్కొండ జేరతం." అన్నడు రామి బస్సు జివం తప్పించుకొంట గోల్కొండ జేరింది. ఇద్దరు ఇగ బస్సు దిగి గోల్కొండ సొయిగ నడవ బట్టింద్రు.

"ఇప్పుడు భీ సైకం కట్టాల్రా రామి?" అన్నడెంకిగాడు జ్రరంత ఏడుపు మొహం పెట్టి.

"ఎహె! పూరకె గభరాయించకు ఈడ సైకం గీకం లేకుండనే సూడచ్చు" అన్నడు రామి.

"అయితె రామీ, గోల్కొండంటె ఏం ఏరా?"

"గోల్ అంటె గుండ్రటి కొండంటె కొండే!"

మలుపు తిరగంగనే పెద్ద తలుపులు కనిపించినై. ఆ మొద్దోల తలుపులు సూసి గభరాయించిండు ఎంకి.

"ఒరే రామి ఇదే భూతమొ దయ్యమొ కట్టిందిరా!" అన్నడు సొప్పదంట్ల పోళ్ల మొడు నోరెల్లబెట్టి.

"అవురంగజేబునే రాజ" అన్నడాడు.

"గట్లనా!" అన్నడు మనోడు జ్రరంత తంగై.

లోపల ఎన్నో బొమ్మలు పెట్టింద్రు. ఇగ లోపకెల్తున్నా కొద్ది సెప్ప సురూ జేసిండు రామిగాడు.

"ఇప్పుడ సప్పట్ల కొడ్తె, అగో ఆడ పైన ఇనబడ్తది. అది భీ సూస్తరా" అని రామిగాడు ముందుకు నడవబట్టిండు.

జ్రరంత దూరం పొంగనే ఆడో పెద్ద బావి కనబడబట్టింది.

"ఇందల్ల సైనికులోరు తానం గిట్ల సేసెటోరు." అన్నడు. ఎంకిగాడు జ్రరం వంగబడి సూసిండు. నీల్ల సప్పగున్నై. ఇగ ముందుకెల్లి మెట్లెక్క బట్టింద్రు. జ్రర దూరం పొంగనె ఒక పెద్ద దుకునం లాగున్నదాంట్లకు తోల్కపొయిండు.

"ఇదేంద్రో?" అన్నడెంకిగాడు.

"ఇది రామదాసుగారి బందిఖాన" అన్నడు రామి.

'ఆపైన బొక్కలున్నయ్ గవేందో?'

"మునుపు ఆడికెల్లి అన్నంగిట్ల ఏసె టోరంట."

ఎంకిగాడికి రామదాసోరి కట్టాలను యాద్ సేసుకొంటె ఏడుపు రాబట్టింది. ఆడికెల్లి బందిఖాన మీది కెక్కింద్రు. పైకెల్లి బొక్కలో సూస్తె కళ్లు గిర్రున తిరగబట్టినై.

ఇగ ఆడంత సూస్కొని ఇంకా పైకెక్క బట్టింద్రు.

జ్రరంత దూరం ఎక్కంగనె కాలిక మ్మొరి గుడి కంటబడింది.

"ఇక్కడికి రండియ్యో!" అనరిసిండి ఆడి కెల్లి అయ్యగారు.

ఇద్దరు సిడీలెక్కి గుడిలో కెల్లింద్రు.

అయ్యగారు ఆడికెల్లి బొట్టు తీసి ఇద్దరి మొహానికిపూసిండు.

ఇగ ఇద్దరు కాలికమ్మొరికి దండా పెట్టి ఎనక్కు తిరిగింద్రు.

"ఎందయ్యో! అమ్మొరికి సైకం గిట్ల ఇయవా?, అమ్మొరికి సైకం గట్టకుంటె. నీకు 'సట్టం' సేస్తది. ఆ!" అన్నడాయన.

ఎంకిగాడు రామిగాడి సాయ్గ సూసిండు.

"సైకం కట్టకుంటె అమ్మొరు కొండ మీదికెల్లి కిందికి తోస్తరు." అన్నడాడు. ఇగ ఏమనలేక అమ్మొరి పేర్న సైకం గట్టిండు.

ఇద్దరు గుడి పక్కకెల్లి వున్న పిన్న గుట్టెక్కింద్రు. ఆడ రెండు పెద్ద తుపా కులు కంటబడినై. ఆడికెల్లి కిందికి సూస్తె బస్సు ముత్తెమంత కంటబడింది.


ఎంకిగాడికి మబ్బుల మీద కూకున్న ట్లైంది.

ఇద్దరూ ఆడ బీడీ కాల్సుక లాగి మెల్లెగ రాజుగారు సభసేసే సోటికి పొబట్టింగ్రు.

మూడంతస్తులు ఎక్కినాంక ఏడం సేత్తై పున్న సన్న గొందులో సిడీ లెక్కాలె రాజుగారి కుర్చీ కింది నుండి బైటి కెల్తది. ఆడికెల్లి పై కెల్లినాంక దూరం కెల్లి సప్పట్ల ఇనబడినై.

"ఇన్నావె?!" అన్నడు రామిగాడు ఖుషీ అయ్యి.

(62 వ పేజీ చూడండి)



"గదే అరిగో! ఆడ సూడు సిన్నగ కంటబడ్తుంది, ఆడికెల్లి ఒకడు సప్పట్లు కొడ్తున్నడు. ఈడ కూకున్న రానికిన బడ్తది. ఎరకైందా?"

అగో, ఆ రెండు గోపురాల భవంతులు, తారామతి, ప్రేమామతి అనే రాజ సానులది.' ఆడ కూకొని రాజు సప్పట్లు సరిస్తె ఆరికినపడి ఈడికొచ్చి తైతక్కలాడ్తది.

"అవల సెరువ ఉసేన్‌సాగరా? "అడిగిండు ఎంకి.

"కాదన్నా అది గండిపేట. పట్నంల నీళ్లు ఇండ్లకెల్లే తాగుతరు. ఆ పక్క సూసినావ్ అది ఇమాయుత్ సాగర్."

మరి కింద కంటబడ్తున్న ఆ సిన్న భవంతులేందో?'

"అవ్వి మిలిట్రోళ్లుండేవి. ఈడ సైన్యంల సేరినోళ్లందరు ఎట్ల యుద్ధం సేయాలో నేర్సుకొంటరు."

ఇద్దరు కిందికొంగబడి ఖుషిగా సూడబట్టిండ్రు.

ఇంతల పైకి కొందరు తెల్లదొర లొచ్చిండ్రు. ఆరి ఎంటికలు ముసలోలకై నట్టు తెల్లగున్నయ్. కొందరి కండ్లు రాగెంటికలున్నయ్. ఆరి గుడ్లేమొ నీలంగున్నై. అదేందో బాసల మాట్లాడబట్టిండ్రు.

ఎంకిగాడు రామిగాడ్ని జర్రంత పక్కకు పిలిసి "ఇగో అంద్ల మొగోల్లా ఆడోరూ, అందరూ మొగోరేనా? "అన్నడు ముక్కునే లేసుకొంట.

"ఏహె కాదులె అంద్ల ఆడోరు భీ వున్నరు. ఆరు భీ సొక్కలాగులే ఏసుకొంటరు."

"నీ కెట్ల తెల్సురా రామీ?'

"ఆడోరు మూతికి ఎర్రరంగేసుకొంటరు. ఆరికి గిరజాల జుట్టుంటది." ఇద్దరిగ ఆడికెల్లి కిందికి పోదామనుకున్నరు.

ఇద్దరు అనేకం ఇంతల్ని ! ఇనుకొంట నడవబట్టిండ్రు.

కుడేపున్న సిన్న సందు గుండ దిగబట్టిండ్రు. ఈడికెల్లె రాజు రోజొచ్చెటోడంట! జర్ర ముందుకు దిగినాంక మంచినీళ్ల బావి సూపిండు రామి. గోడల మీన మంచినీళ్ల గొట్టంభీ సూపిండు.

"ఇయన్ని నీకెట్ల తెల్సురా రామి?" అనడిగిండెంకగాడు.

"గదంతేలే" అన్నడాడు మీసాలు తిప్పకొంట,

# ఎంకిగాడు పట్నం...

(29-వ పేజీ తరువాయి)

ఇద్దరూ ఇగ దిగి జనాన్లకొచ్చిండ్రు. ఈడ జనానుండెడిది," అన్నడు రామి.

"జనానంటె ఆడోరు గద? అడిగిండెంకి.

"జౌనే" అన్నడాడు.

"గీ బావెందు కన్నా?" అడిగిండు ఎంకి.

"గిదా? గిది రాజాగారును దుష్మనులు, గదే సత్రువులు పట్టుకుంటె ఈడ అయిన పెళ్లాంలందరు గీ బావిల దూకి సచ్చెటోరంట. ఇగ ఆ ముందుగాల వున్నది సూపినావ్ ఆడ నిలబడి నీ వొర్లితె మల్లీ ఆడికెల్లి ఇనబడ్తది. సూస్తవ్‌దా" అని ఎంకిగాడ్ని ముందుకు గుంజుకపోయిండు.

"ఈడ నిలబడి పెద్దంగ ఒర్లు" అన్నడు రామి.

"ఓరి రామిగో" అర్సిండెంకి.

జర్రాగి నాంకిన బడ్డది ఓరి రామిగో.

"ఓర్ని అక్క నిజమేరో." అన్నడు ఎంకి గుడ్లెల్లబెట్టి.

ఆడికెల్లి నడుస్తు తుపాకులున్న భవంతులు సూస్కొని బైటబడిండ్రు.

ఇగ బైటికి రాంగనే రిచ్చోల్లెంబడి తగలబట్టిండ్రు, "గండిపేట్ తీస్కపోవాలె? తీన్ రూపాయ్ ఇస్తావ్?

ఎంకిగాడి గుడ్లు పచ్చబడినై.

"రామీ పైకెల్లే గండిపేట్ సూసినం గద, ఇగ ఇంటికి పోదాం పద."

"గట్లనే కానియరాదు." అన్నడు రామి.

ఇగ ఇద్దరు బస్సుకాడికి నడిసిండ్రు.

బస్సుల జనం అప్పటికే నిండిండ్రు. ఇగ ఇద్దరూ కూడ నిలబడిండ్రు. గిప్పేమొ బక్క బస్సులాయ్. సర్కారోరి బస్సులైతె లావుగుంటై యని ఎరకపర్సిండు రామి. జర్ర టేమ్ బిలాయించినాంక బస్సు "డుర్ మని ఒక్కసారి ముందుకురికింది. ఎంకిగాడు కిందికి మీదికై ఎనక కూకొని నిద్దర్లున్నవ్వ మీన దబ్బున కూలిండు. ఆ అవ్వ 'గయ్‌న' లేసింది.

"కళ్లుపోరలు కమ్మినాయ్‌రా? వాడి సెట్టంతోడివి ఆడకూతురుమీద పడ్తావ్‌ర? నీకు అక్కఅమ్మా లేర్ర?'

ఓ అవ్వో మా ఓడు మొన్ననే వూరికెల్లి వచ్చిండు. ఆడికేం తెలవదూ, పోనిదాదు?"

ఇగ ఎంకిగాడు భయంల పైసోన్ని సీకుర్ని గట్టిగ పట్టుకొన్నడు.

బస్సు కదిలింది, పట్నం పోయిగ.

'కార్వాన్' కాడ దిగే దాక ఆ అవ్వ బూతులు తిడ్తనేపోయింది.

నవ్వపూలు కాడ బస్సుదిగి సీరిబండపోయి నడిసిండ్రిద్దరు. ఇద్దరు ఇంటికి జేరంగనె అన్నం దిని నిద్రపోయిండ్రు.

*   *   *

పొద్దుకూకే ఏలకు లేచిండెంకిగాడు. సల్లని నీళ్లతో మొహం గోట్ల కడుగి పైకం లెక్కబెట్టిండు.

"ఓరి రామిగో", అనర్సిండు లెక్కసూసి.

"ఏందే అన్నా?

"అరే పైకమై పోయిండ్రా, నాగికేం కొనలేదింక, అన్నడు లాల్‌మూతి సేస్కొని.

లేదన్నా, పట్నమంటె పూకైతిదా? పోని పదిరుపాలు రైలు టిక్కటికుంచుకో, ఇంకో పది పెట్టి పశువులుండె జూ సూసొద్దాం."

"ఏహె గదేం సూస్తం మా సొన్న దంట్ల పొలెంల ఎన్ని గొడ్లంటున్నయ్ ఇశేం సూడాలె" అన్నడాడు ఏడ్సు గొంతులో.

"కాదులె సూస్తెగాని తెలవదు నీకు"

ఇగెంకిగాడి కూకోక తప్పలేదు.

ఆ రెయ్యి ఎంకన్నకు నిద్దరేపట్టలేదు

రెయ్యంత కలల నాగివచ్చి, 'మావా, నాకు సీరలు తెత్తావె?' అన్నది. ఆరెయ్యంత నాగితోనే ఉన్నడు ఎంకి కలల.

ఇగ తెల్లారి గట్ల కేసి నళ్లు తోమ్కొని సాయ్ గిట్ల తాగి తానం గిట్ల సేస్కొని. సద్ది తిని, రామిగాడి రిచ్చల కూకొని జూ సాయ్ బైలెల్లిండు.

"రామి గిదేంద్రా గుడి లెక్కున్నది?" అనడిగిండు ఎంకిగాడు దార్ల.

"ఒనే, గిది గుడి లాగుండేదే! ఈడ నాయం సెప్తరు. దీన్ని హైకోర్టంటరు.

రిచ్చ మలుపులు తిరుగుతాపోయింది!

ఇగ సాన దూరం పోయినాంక ఒక పెద్ద దరవాజ ముందాపిండు రామిగాడు. ఎంకిగాడు దిగినాక రిచ్చనోకాడికి దీస్కబోయి ఒకాయనకు రిచ్చాయిచ్చి అట్టముక్క తీస్కొటిండు.

"గదేంద్రో రిచ్చనిచ్చి అట్టముకతెతవ్?" అనడిగిండు ఎంకి.

"గదంతలె మల్లీ అట్టముక్క సూపితె మన రిచ్చ మనకు వాపసిస్తరు. ఆ! పైకమేది?" అడిగిండు రామిగాడు.

ఇగ ఇనుకున్కుంట ఎంకిగాడు బొడ్లకెల్లి పైకం తీసి రామిగాడికిచ్చిండు.

ఇద్దరిగ టిక్కెట్టు కొని లోపలికి బోయిండ్రు.

లోపలి కెల్లంగనె ఎంకిగాడు తంగైండు.

ఆడెన్ని రంగు పూల సెట్లున్నయ్? దారి పొంటి ఇటు అటూ రంగురంగుల పిలకలున్నయ్! ఇగెంతమంది జనం! మంద లకు మందిలే! లోపలికి మర బండ్లు పోబట్టి వస్తున్నయ్.

ఎడమసేతెపు ఎల్తె ఆడ ఎన్నిరకాల జంతువులున్నై గుండె పగిలానైంది. నీటి పంది, ముల్లపంది, దుప్పి, ఏనుగు, సింగం, పెద్దపులి, గుడ్డేలుగు, కోతులు, కొండ ముచ్చుల, తాబేలు, పాములు రంగుల పిట్టలు, కొత్త జంతువులు రంగురంగుల సీరల మడుసులు....?!!

అన్ని సూసినాంక ఎంకిగాడు యూర్, మోన పేము పెట్టి— రామా! లోకం లన్ని గొడ్లుంటాయిర?'' అన్నడు.

''మరేమనుకొన్నవ్? ఇంక సూస్తవులా?'' అని ఇంక ముందుకు దీస్కపోయిండు.

ఇగ జర ముందుకు పొంగనె ఆడ తోట యమగున్నది! తిరిగి తిరిగి రామి ఎంకి, ఒకాడ రాయి మీన కూకున్నరు.

జర్రాగి ఎంకిగాడు కాలువడ్డు రాసీకు బోయిండు. జర దూరం పొంగనె గుబురు గున్న సెట్లు కనుపించినై, ఆడికెల్లి సూకబోయిండు.

రేపో నేను నిన్ను మనసారా ప్రేమి స్తున్నా!' యాడికెల్లో మాట ఇనబడితె. ఎంకిగాడు మెల్లగ లేసి చెట్ల గుబురును పక్కకు జరిపి సూసిండు.

ఎవరో ఇద్దరు వయసోల్లు. అండ్ల ఒకరు మొగ, ఒకరు ఆడ. మొగాయిన ఆడమడిసి తొడ మీన తలపెట్టి మాట్లా డుతున్నడు. ఆమె కూకొని ఆయన తల జుట్టుల ఏల్లు పెట్టి మాట్లాడు తున్నది.

నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను జాకబ్ మరి నా మాటెప్పుకోవాలిగా?

ఎంకిగాడికి జంట జర ముచ్చటి గనిపించింది.

''మీ అయ్యలొప్పకుంటె నేనొప్పు తాగా! యమగుంది మీ జంట.'' అన్నాడు జర్రంత ఖుషై''

ఆ మగమడిసి గబుక్కున లేసి ఎంకి గాడ్ని సూసి కోపంగ లేచి మనోడి కాడి కొచ్చిండు.

''మేం ప్రేమించుకొంటె సూస్తా వురా బ్రూట్' అని ఒక సెంపదెబ్బ పెట్టి పోయిండు.

ఎంకిగాడు సెంపమునొత్తుకుంట రామి గాడి కొచ్చి సెప్పిండు.

''గట్ల సూడకూడదే మావ?'' అన్న డాడు జర గభరాయింది. ఇగ ఆడనే వున్న గడ్డి మీన పల్లగ నీడుంటె పడు కుండెంకిగాడు.

మెల్లగ నిద్రబట్టింది.

కలల ఎర్రసీర గట్టిన సిన్నది ఎగుర్త కనబడింది. ఎర్ర సీర దొరసాని, ఎర్ర పెదాల పిట్ట అబ్బ పిట్టని వాటేస్కొ బోయి సక్కకొరికిండు. ప్రక్కనున్న నీటి గుంటల ధభీమని పడ్డడు ఎంకిగాడు.

శబ్దం కాంగనే పక్కకు సూసిండు రామి.

ఎంకిగాడు నీల్లల్ల పడి చేతులు కాల్లు కొట్టుకుంట

''రా నయాల!'' రా! అరవబట్టిండు.

''ఎంకన్న లే! నీల్లల బడి కొట్టుకు లాడ్తవ్? అని అర్సినా హోష్ లేకుండ బోయింది. ఇగ లాభం లేదని ఎంకిగాడి తల్ల నీల్లల్ల ముంచిండు. జర సేపటికి మెల్లగ కల్లు తెర్సిండు. ఎంకిగాడు, పెయ్యంత మన్నంటింది. జరసేపటికి జరి గింది సెప్పిండు రామిగాడు. ఎంకిగాడు నవ్వి తన కొచ్చిన కల గూర్చి రామిగాని కెరకపర్చిండు.

ఇద్దరు మెల్లగ నడుస్త బైటకొచ్చిండ్రు ఎంకిగాడ్ని రిచ్చల కూకుండ బెట్టుకొని ఇంటి పొంగ రిచ్చనని నడిపిండు రామి.

ఇంటికొచ్చి అన్నం దిని మంచం మీన కూకునంగనె నిద్ర పట్టిందెంకిగాడికి. నిద్రల బాగ జరం కూడొచ్చింది. నిద్రలనే అరవ సురూజేసిండు. ''ఓసి నాగో సస్తినే, ఈ మాయదారి పట్నం కోసం నిన్నొదిలొనే నాగో!'' అని అరవ బట్టిండు. మారత్త ఇంతల కసాయం కాసి ఆడి నోట్ల బోసింది. రాత్రంత అరిసిఅరిసి తెల్లారి జర్రంత కునుకు బట్టింది. ఎంకిగాడికి.

* * *

తెల్లారిటాలికి జర జరం తగ్గింది ఎంకిగాడికి.

లేవంగనే మొహం కడిగి సుర్ల కట్టు కొని నస్త రామా! అత్తో వస్తా.'' అన ర్సిండు.

''ఇపుడేం పోతవ్? నిన్న రెయ్య పెయ్య ఏడెక్కింది. పైత్తెం మాటలింక తగ్గ లేదు, ఊపుటుండు ఎంకి!'' అన్నదత్త.

''లేదత్త పోవాలె'' ని మొండేస్కొని కూకు న్నడు.


ఇగ లాభం లేదని ఎంకిగాడ్ని రిచ్చల కూకొపెట్టుకొని రైలు స్టేసనికి తీస్క బోయిండు.

రైలు కదిలేముందడిగిండు రామి— ''మల్లెప్పుడొస్తవ్ ఎంకిగా?''

''ఇగేడికి రాన్రో'' అన్నడు గొంగడి ఇంక నిండ కప్పుకొంట.

రైలు బైలెల్లింది.

రైలు పట్నం దాటి పొలం మద్యల పడి పురకబట్టింది. ఇంతల తెల్లకోటు



వొరొచ్చిండు.

అయిన్ని సూడంగనె ఎంకిగాడు, తిక్కటి తీసిచ్చిండు.

అటుసేసిటుసేసి గాలికి రైలు పొన్న


రచయితలకు సదవకాశం

చారిత్రిక, జానపద, డిటెక్టివ్, మిస్టరీ నవలలు ప్రచురణకు కావలెను.

వివరములకు :

వాసవా బుక్స్

రాజమండ్రి-2.

రెండు రత్నాలు

Licenced under M. & T. P. Act — Rule (83)

వీర్యస్తంభనము—Tonic Pills&Oil


కడుపులోకి పైకి మర్దనకు (1) కోర్సు 20 రోజులు. రూ. 2లు - స్పెషల్ రకం రూ. 47

పైకం M.O. పంపాలి—వి. పి. లేదు.

డా. రత్నం సన్స్, (Estd 1904)

మలకపేట బిల్డింగ్స్, New అజంపూరా మార్కెట్ వద్ద, హైదరాబాద్—36 ఆం. ప్ర.

హెడన్సా




మూల వ్యాధులకు.

ప్రతి చోట దొరుకును

పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతం

ఆరోగ్యానికి బలానికి

ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్

మదరాసు-17


# ఎంకిగాడు పట్నం...

దంట్ల పాలానికి సీకటి పడేటాలకి సేరుకున్నది.

స్టేసన్‌ల దిగి సెయ్యిరిచి ఎంకిగాడు పొలెం సొంయిగ నడవబట్టిండు—తలనిండ గొంగడి కప్పుకొని.

"మావో!" యాడికెల్లో నాగి గొంతు ఇనబడింది.

ఎంకిగాడి గుండెల్ల రాయిపడింది. జర్ర జల్ది నడవబట్టిండు. ఎనకకెల్లి నాగి గడ్డిమోపు మొస్తవురుక్కొంట ఎంకిగాడి కాడికొచ్చింది.

"మావా! పట్నం సూసినావె?!"

"ఆ." అన్నాడు గొంగడింక నిండ కప్పుకొంట.

నాకేం తెచ్చినవ్?" అంది నాగి.

"నెత్తిన గుడ్డేస్కొచ్చిన." అన్నాడు ఏడ్పు మొహంపెట్టి.

"ఏమో!" అంది నాగి జర్ర జల్ద నడుస్త.

ఇద్దరూర్ల పడేటాల్కి జర్రజర్ర సీకటి పడబట్టింది.

ఎంకిగాడు వూర్ల కాలు పెట్టంగనె వూర్ల పొల్లగాళ్లు, పెద్దోళ్లు, ఆడోళ్లు అందరూ ఎంకిగాడ్ని సుట్టిండ్రు.

పొల్లగాల్లైతె ఎగరబట్టిండ్రు "ఎంకిగాడు పట్నం సూసిండు. "పెద్ద తాత అనబట్టిండు. "ఎంకిగా మాకేం తెచ్చినవ్!"

నాగి అరవ బట్టింది. "నా మాటేం సేసినవ్ మావో...?!"

ఇగ ఎంకిగాడు ఏడ్పు మొహం పెట్టి అన్నడు.

"ఇగో నా కాకలెస్తుంటె మీగోలేంది? అన్నడు. జర్ర కోపమై.

నాగి అందర్నదిస్తంది

"ఇగో మల్లమత్త, రామయ్య తాతా అంతా సావిడి కాడికెల్లి కూకొండి. నాలుగు లాంతర్లు గూడ తీస్కొని రండి. మా ఎంకి మావ అన్నం దినాడి కొస్తడు. అందరి మద్యల కూకొని పట్నంల సూసింది సెప్తడు." అంది.

ఇగ అందరు ఆర్లారు గుసగుసలాడుకొంట ఎల్లిపొయిండ్రు.

ఎంకిగాడి కన్నంపెట్టి వూరి మధ్యల సావిడి కాడికి గుంజుకపొయింది.

ఎంకిగాడు అరుగు మీన కూకున్నడు. సొప్పదంట్లపాలెం రాజులాగున్నడాడు. అందరొచ్చి కూకున్నాక ఎంకిగాడు సెప్ప సురు జేసిండు.

"ఇగో బాగ ఇనండి నేనొక్కపాలె సెబుత"అన్నడాడు.

అందరు ఆడెప సూడబట్టిండ్రు.

"నేను పట్నంల దిగంగనె నాకు రామిగాడు నా మెడల పూలదండేసిండు". అన్నడాడు. సుట్ట పొగ గుంజి మెల్లగ వదుల్త.

ఆడున్నందరు ముక్కునేలేసుకున్నారు.

"ఏరా ఎంకిగా రామిగాడికెట్ల తెల్సురా వచ్చినట్లు?" అన్నది సెన్నమ్మవ్వ.

"గదట్లనే తెలుస్తదిలే! అన్నడాడు.

"ఇగ ఆడికి జేరంగనె ఆడు నన్ను మరబండ్ల కూకొబెట్కొని పెద్ద సత్రంల దింపిండు. ఆడ ఎండాకుల అన్నం పెట్టిండ్రు. రాత్రిల్లాడ వజ్రాలోలిగ సగటోలోలుగుంటయ్. ఆడ రాచ్చసులు కట్టిన భవంతులు శాన ఉన్నయ్.

"అయితె రావణాసురుడి ఇల్లు ఆడే వుందా?" అడిగింది లచ్చక్క.

"వుంది. ఇంటి ముందు ఆయన బొమ్మ రంగుల్ల వుంది. ఆయనందరికి గుడ్డ మీన కనబడ్తడు.

పోలవ్వ గుడ్లు పెద్దగ సేసింది.

"ఒసి నాగో ఎంకిగాడికి దిష్టి తియ్యవే!" అంది యాదమ్మదిన.

ఎంకిగాడు మీసాలు దిప్పుకొన్నడు.

"ఇగో ఎంకిగా ఈ పాలి ఎండల్ల ఇందరం పోదామ్రట పట్నం— సూన్కికి?" అంది పోలవ్వ.

ఎంకిగాడు జర్రంత హైరానై లేచి ఇంటి సొంయిగురుకబట్టిండు.

అందరు తంగై ఆడనే కూకున్నరు. ఆడట్లెందుకు సేసిండో ఎవ్వరికీ ఇంత వరకు అంతుబట్టలేదు.

మరి ఇగో మీరెవరైనా సొప్పదంట్ల పాలెమొళ్లైతె ఎంకిగాడ్ని అడగండి. "ఏం ఎంకిగా, పట్నం సూసినావ్?" అడిగ ఉరికి పోతడు.

## అంకితం

అమాయకుడు, ఉత్సాహవంతుడైన మా ఎంకిన్నకు ●


**Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.**